క్లుప్తంగా

వైభవంగా వాసవీ హోమం

పెనుగొండ: స్థానిక వాసవీ శాంతి థాంలో వాసవీ హోమం వైభవంగా నిర్వహించారు. సోమవారం ఉదయం కర్ణాటకలోని తుమ్కూర్ నుంచి భక్తులు భారీగా తరలి వచ్చారు. ఉదయం నుంచి గోపూజలు, 102 అడుగుల రుషీగోత్ర మందిరంలో 90 అడుగుల పంచలోహ విగ్రహ దర్శించుకున్నారు. మరకత శిల వాసవీ మాతకు అభిషేకం చేశారు. హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు.

నేటి నుంచి మహిళా సర్పంచ్‌లకు శిక్షణ

నరసాపురం రూరల్: నరసపురం డివిజన్‌లో ని మహిళా సర్పంచ్‌లకు మంగళవారం నుంచి మూడు రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ గాదిరాజు రామకృష్ణంరాజు తెలిపా రు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ తరగతులు ఏర్పాటుచేస్తామని, పంచా యతీల పరిపాలన, నిధుల వినియోగం, ఖర్చులు తదితర అంశాలపై శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు.

మానవత కార్యవర్గ ప్రమాణ స్వీకారం

పెనుగొండ: ఆచంట కమ్మ కల్యాణ మండపంలో మానవత ఆచంట మండల నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. అధ్యక్షుడిగా సజ్జా నారాయణ, కార్యదర్శిగా గున్నా బత్తుల ఆనంద్ కుమార్, కోశాధికారిగా మడిచర్ల సతీష్, ఉపాధ్యక్షుడిగా తమ్మినీడి సత్యనారాయణ మూర్తి, సహాయ కార్యదర్శిగా మానేపల్లి వెంకటేశ్వరరావు, కేటా రామకృష్ణారావు, నాగేశ్వరరావు, బొక్కా రామకృష్ణ, షేక్ ముజుబల్ రహమాన్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. సంస్థ జిల్లా కమిటీ సభ్యుడు కొత్త సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు కుక్కల లీలా ప్రసాద్, ఎస్సై కట్టా వెంకట రమణలు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికుల పోరు ఉద్ధృతం

- నిరాహార దీక్షలు, అర్ధ నగ్న ప్రదర్శనలు
- అధికారులకు సమ్మె నోటీసులు
- ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్
- ప్రభుత్వం దిగిరాకపోతే ఆందోళనలు మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరిక

ఉద్యోగ భద్రత కోసం మునిసిపల్ ఇంజనీరింగ్, అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులు చేపట్టిన పోరు ఉద్ధృతంగా కొనసాగుతోంది. ఇప్పటివరకు వాటర్‌వర్క్స్, లైటింగ్ విభాగాల్లో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఒక్కరి చొప్పున సహకరించామని, ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారంలో శ్రద్ధ చూపకపోవడంతో ఇకపై పూర్తిస్థాయి ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. అధికారులకు సమ్మె నోటీసులు ఇచ్చారు. తమను పర్మినెంట్ చేసి టీడీపీ ఇచ్చిన ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



నరసాపురం వశిష్ట గోదావరి వలంధర్ రేవులో మున్సిపల్ కాంట్రాక్ట్ ఉద్యోగులు, కార్మికుల జలదీక్ష



తణుకులో మునిసిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలోని నగరపాలక సంస్థల్లో, పురపాలక సంఘాల్లో, నగర పంచాయతీల్లో పనిచేస్తున్న ఇంజనీరింగ్ విభాగంలోని అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని మునిసిపల్ ఇంజనీరింగ్ అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులు డిమాండ్ చేశారు. స్థానిక ఆర్ ఆర్ పేట ఎస్ ఆర్ టు వద్ద ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన గేటు మీటింగ్‌లో వారు మాట్లాడారు. ఏళ్ల తరబడి అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్నా ప్రభుత్వం తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగ సిబ్బందిని పర్మినెంట్ చేస్తామని టీడీపీ ఇచ్చిన ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని ఏఐటీయూసీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ డాంగే, జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఏలూరు ఏరియా కార్యదర్శి ఏ అప్పల రాజు, ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు బి నాగేశ్వరరావు, కోశాధికారి బి నారాయణరావు, యూనియన్ నాయకులు నారా శ్రీను, కందుల శ్రీనివాస్, అప్పారావు తదితరులు నాయకత్వం వహించారు.

నరసాపురంలో అర్ధనగ్నంగా జలదీక్ష

నరసాపురం: స్థానిక వశిష్టగోదావరి వలంధర్‌రేవు గోదావరిమాత విగ్రహం వద్ద కార్మికులు సోమవారం వినూత్నరీతిలో ఆందోళన చేశారు. అర్ధనగ్నంగా గోదావరిలో దిగి జలదీక్ష నిర్వహించారు. కార్యక్రమానికి జేఏసీ కమిటీ నాయకులు ఆర్ రత్నం, వి.ఫణి, ఎం.సత్యనారాయణ, కె.కాశీ, సీహెచ్ వాసు, ఎ.మధుబాబు, ఎం.సుజాత, టి.కళ్యాణి, ఎస్ దేవి, కె.అనంతలక్ష్మి నాయకత్వం వహించారు.

ఇకపై పూర్తిస్థాయి సమ్మె

తణుకు అర్బన్: ఇకపై పూర్తి స్థాయి సమ్మెకు దిగుతున్నట్లు మునిసిపల్ ఇంజనీరింగ్ అవుట్ సోర్సింగ్ జేఏసీ అధ్యక్ష, కార్యదర్శులు ఉండ్రాజవరపు శ్రీను, గెల్లా విజయ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం మునిసిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం సమ్మెలో భాగంగా మునిసిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన శిబిరంలో కార్మికులు తమ నిరాహారదీక్షలను కొనసాగించారు. ఈ కార్యక్రమంలో దాసరి సత్యనారాయణ, పిండి పెద్దిరాజు, కాంతారావు పాల్గొన్నారు.

పోటీ కార్మికులను దింపడంపై అభ్యంతరం

తాడేపల్లిగూడెం (టీఓసీ): మునిసిపాలిటీ ఆధ్వర్యంలో పాతూరు శివారు హెడ్ వాటర్ వర్క్స్, ఫిల్టర్ ప్లాంట్‌లు వద్ద పోటీ కార్మికులను దింపారన్న విషయాన్ని తెలుసుకున్న ఇంజనీరింగ్ సెక్షన్ కార్మికులు సాయంత్రం నిరసన శిబిరం వద్ద నుంచి బైక్ ర్యాలీగా స్థానిక హెడ్ వాటర్స్ వర్క్స్ గేటు వద్దకు చేరుకున్నారు. పోటీ కార్మికులను తీసుకురావడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. నిరసన కార్యక్రమం వద్దకు పోలీసులు చేరుకుని వాటర్ సప్‌లైను అడ్డుకోవడం సరికాదని, ప్రజలు ఇబ్బందులను గుర్తించాలని, లేని పక్షంలో అరెస్ట్ చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

వైఎస్సార్ సీపీ మద్దతు

జంగారెడ్డిగూడెం: న్యాయమైన కోర్కెల కోసం మునిసిపల్ ఇంజనీరింగ్ వర్కర్లు చేపట్టిన ఆందోళనలకు వైఎస్సార్ సీపీ నాయకులు మద్దతు తెలిపారు. యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కమిషనర్‌కు సమ్మె నోటీస్ ఇచ్చినట్లు యూనియన్ అధ్యక్షుడు కంతేటి వెంకట్రావు తెలిపారు. సమ్మెకు మద్దతుగా మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ కంచర్ల వాసవి నాగరత్నం, ముప్పిడి వీరాంజనేయులు, వైఎస్సార్‌సీపీ టౌన్ ప్రెసిడెంట్ చిటికెల అచ్యుతరామయ్య, కౌన్సిలర్లు మద్దతు తెలిపారు.

లయన్స్ గవర్నర్‌గా పాపారావు నాయుడు

పాలకొల్లు సెంట్రల్: పట్టణానికి చెందిన లయన్స్ సభ్యుడు నిమ్మల పాపారావు నాయుడు లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా నియమితులయ్యారు. సంవత్సరం పాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. జిల్లా గవర్నర్‌గా ప్రమాణస్వీకారానికి జూలై 17న యూఎస్‌ఏ ఒరలాండో వెళ్లనున్నట్లు క్లబ్ సభ్యులు తెలిపారు. లయన్స్ గవర్నర్‌గా పాలకొల్లుకు చెందిన మూడో వ్యక్తి పాపారావు నాయుడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం రాత్రి లయన్స్ కమ్యూనిటీ హాలులో క్లబ్ సభ్యులు పాపారావు నాయుడు, అన్నపూర్ణలను ఘనంగా సత్కరించారు.

ఘనంగా జాతీయ గణాంక దినోత్సవం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జాతీయ గణాంక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ తిరువీధుల రాజరాజేశ్వరి మాట్లాడుతూ విద్యార్థులు గణాంక శాస్త్రంలో పట్టు సాధిస్తే ఉద్యోగావకాశాలు మెండుగా ఉన్నాయని తెలిపారు.

శత కీర్తన నీరాజనం



సాయినాథునికి శతకీర్తన నీరాజనం

పెనుగొండ: సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలు సందర్భంగా సత్యసాయి బాబాకి శతకీర్తన నీరాజనం ఘనంగా సమర్పించారు. సోమవారం సిద్ధాంతంలోని చౌదరీస్ రామాలయంలో సత్య సాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో 100 కీర్తనల భజన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కె.రవీంద్ర ప్రసాద్ మాట్లాడుతూ నవంబర్ 23 నాటికి 100 ప్రదేశాల్లో 100 కీర్తనలు వంతున పాడుతూ, ఆధ్యాత్మిక, సేవ, విద్యా విభాగాల్లో భజనలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ముళ్లపూడి సూర్యప్రకాష్‌రావు, ఎం రామారెడ్డి, సవీర్ బాబా, శ్రీరామచంద్రమూర్తి, బోళ్ల వెంకటేశ్వరరావు, ఆరుమిల్లి సాయిబాబా, మహిళలు పాల్గొన్నారు.

కాలుజారిపడి కార్మికుడి మృతి



దుర్గా హనుమంత కనికిరెడ్డి (ఫైల్)

పెనుమంట్ర: వెలగలవారిపాలెం గ్రామంలో సత్తి దుర్గా హనుమంత కనికిరెడ్డి (41) తన ఇంటి వద్ద బాత్‌రూమ్‌లో కాలుజారి పడడడంతో ఆయన తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందారు. ఆ సమయంలో భార్య పిల్లలతో పుట్టింటికి వెళ్లడంతో కనికిరెడ్డి ఒక్కరే ఉన్నారు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. కనికిరెడ్డి ఆదివారం రాత్రి బాత్‌రూంలో స్నానం చేసి బయటకు వస్తుండగా కాలుజారి పడ్డారు. తెల్లవారిన తరువాత కనికిరెడ్డి వాకిట్లో పడి ఉండటాన్ని సమీపంలో ఉంటున్న బంధువులు గమనించారు. అప్పటికే మృతి చెందినట్టు గుర్తించారు. కనికిరెడ్డికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆయన కొంతకాలం ప్రైవేటు స్కూల్ బస్సులపై డ్రైవర్‌గా పనిచేశారు. ఇటీవల వ్యవసాయకూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తాడి రాజారెడ్డి ఘటనా స్థలానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని వ్యక్తం చేశారు.

ఇంజినీరింగ్ కార్మికుల సమ్మెకు మద్దతు



ఇంజనీరింగ్ కార్మికులకు సంఘీభావంగా పాల్గొన్న ఉద్యోగులు

పాలకొల్లు సెంట్రల్: మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన నిరవధిక దీక్ష సోమవారం 8వ రోజు కొనసాగింది. దీక్షలో కూర్చున్న కార్మికులకు మునిసిపల్ పిట్టర్ సూర్యనారాయణరాజు సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. న్యాయమైన కోర్కెలు పరిష్కరించే వరకూ విశ్రమించేది లేదని కార్మికులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆంజనేయులు, సూర్యనాగు, శివ, గోపి, బాషా తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నరసాపురం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని నరసాపురం ఈఈ కె.మధుకుమార్ తెలిపారు. కొప్పర్రు, లిఖితపూడి, మండవారిపేట, మంగళగుంటపాలెం, సరిపల్లి, సీతారామపురం, వైఎస్‌పాలెం, రుస్తుంబాద గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఆయన పేర్కొన్నారు.

తణుకు పురపాలక సంఘం
టెండరు నోటీసు

[illegible] తేది : [illegible]

[illegible]

		ఇ.సి.వి (రూ.లక్షలలో)
1.[illegible] పనులు	7 [illegible]	[illegible]
2.[illegible] పనులు	10 [illegible]	[illegible]
3.[illegible] పనులు	5 [illegible]	[illegible]
4.ఎలక్ట్రికల్ పనులు	1 [illegible]	4.21
5. [illegible]	2 [illegible]	14.[illegible]

[illegible]

కమీషనరు,
తణుకు పురపాలక సంఘము

ఉద్యోగ విరమణ సత్కారం

పెనుగొండ: ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వడలిలోని జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు బీఎల్ నరసింహమూర్తి ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా సోమవారం ఆయన్ని పాఠశాల ఆవరణలో సత్కరించారు.

ధాన్యం సొమ్ములు చెల్లించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతులు

పాలకొల్లు సెంట్రల్: దాళ్వా ధాన్యం బకాయిల సొమ్ము వెంటనే చెల్లించాలంటూ పోడూరు మండల రైతులు సోమవారం తహసీల్దార్ సయ్యద్ మౌలానాకు వినతిపత్రం అందజేశారు. ధాన్యం సొమ్ములు అందకపోవడం వల్ల బ్యాంకు రుణాలు చెల్లించలేకపోతున్నామని, బ్యాంకు అధికారులు తమకు నోటీసులు పంపిస్తున్నారని రైతులు వాపోయారు. నేడు సార్వా పంటకు మళ్లీ రుణాలకు వెళ్లాల్సిన పరిస్థితి వచ్చిందని తెలిపారు. పాత బకాయిలు చెల్లించకపోవడంతో కొత్త అప్పు దొరకడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం స్పందించి రైతులు బకాయిలు వెంటనే చెల్లించాలని వారు కోరారు. కార్యక్రమంలో రైతులు మండ వెంకటరెడ్డి, మేడపాటి కుమార్‌రెడ్డి, వై శ్రీనివాస్, కుక్కల సూర్యనారాయణ, దొంగ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెనుగొండ: ఆచంట సమీపంలో జగ్గరాజు కాలువ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వల్లూరుకు చెందిన గుబ్బల బాలాజీ తీవ్రంగా గాయపడ్డారు. సోమవారం ఆచంట నుంచి వల్లూరుకు మోటారు సైకిల్‌పై మరో వ్యక్తితో కలిసి వెళుతుండగా ఈ ప్రమాదం సంభవించింది. మోటారు సైకిల్ అదుపుతప్పడంతో వెనుక కూర్చున్న బాలాజీ తలకు గాయమైంది. ఆయన్ని హుటాహుటిన 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

పాలకొల్లు సెంట్రల్: కాపు క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థి లక్ష్మణ్ హర్షిత్‌కు సోమవారం యునైటెడ్ కాపు సర్వీస్ ఆధ్వర్యంలో రూ.10 వేలు అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ గవర్నర్ పెనుమాక రామ్మోహనరావు మాట్లాడుతూ పేద, మధ్య తరగతి విద్యార్థులకు విద్య, వైద్యం నిమిత్తం తమ క్లబ్ నుంచి సాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు ముచ్చర్ల సంజయ్, అధ్యక్షుడు జక్కంపూడి మదన్, సెక్రటరీ వేరుకొండ దుర్గాప్రసాద్, గుండుమోగుల వీరాస్వామి, గంధం ఏసుపాదం, కె సుబ్రహ్మణ్యం, పశ్యావుల రవి, అడబాల నరేష్, ఉనికెల శ్రీనివాస్‌కుమార్‌లు పాల్గొన్నారు.

సప్త ప్రదక్షిణల్లో పాల్గొన్న భక్తులు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో నాల్గవ సోమవారం సప్త ప్రదక్షిణలు నిర్వహించారు. చేతిలో ఏడు మారేడు దళాల పత్రాలను పట్టుకుని స్వామివారి మాడ వీధుల్లో వేలాది సంఖ్యలో భక్తులు ప్రదక్షిణలు చేశారు. అనంతరం స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. రాత్రి 7 గంటలకు స్వామివారికి పంచహారతుల కార్యక్రమం జరిపారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాస్, సూపరింటెండెంట్ వాసు, అర్చకులు కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ఫిర్యాదుల వెల్లువ


పీజీఆర్ఎస్ కార్యక్రమంలో 43 అర్జీలు



సమస్య వింటున్న ఆర్డీఓ రాజు

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో ప్రజల నుంచి 43 ఫిర్యాదులు వచ్చినట్టు ఆర్డీఓ దాసి రాజు తెలిపారు. ×బీజీబీఎస్ మహిళా కళాశాల కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్‌పై గతంలో చేసిన ఫిర్యాదుపై చర్యలు తీసుకోవాలని కళాశాల అధ్యాపకులు ఝాన్సీ, బిళ్ల బ్రదర్స్ ఫిర్యాదు చేశారు. స్థానిక సికిలే స్కూల్ యాజమాన్యం ఫ్రీ సీటు కోటాలో తన, కుమారుడికి విద్యాశాఖ ఉత్తర్వులు ఇచ్చినా అమలు చేయడం లేదని పట్టణానికి చెందిన అడబాల రాజేష్ ఫిర్యాదు చేశారు. ఆర్ కృష్ణయ్య జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముద్దాడ గణేష్ ఎస్సీ, బీసీ, మైనార్టీలకు అవసరమైన గురుకుల పాఠశాలలు, ఐటీఐలు ఏర్పాటు చేయాలని కోరారని ఆర్డీఓ తెలిపారు. 3006 విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల యజమానులు పేద పిల్లలకు నిర్దేశించిన సీట్లు కేటాయించాలని కోరారు. ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డివిజన్‌లోని అధికారులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు



మోహనరావును సత్కరిస్తున్న ఆర్డీఓ దాసిరాజు, ఎమ్మెల్యే నాయకర్

నరసాపురం రూరల్: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు, అధికారులకు తగిన గుర్తింపు, గౌరవం ఎప్పుడూ ఉంటాయని ఆర్డీఓ దాసిరాజు, ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్‌లు అన్నారు. సోమవారం నరసాపురం మండలం సరిపల్లి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తించి పదవీ విరమణ చేసిన సోడదాసి మోహనరావు అభినందన సత్కార కార్యక్రమం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. మోహనరావు అంచలంచెలుగా ఎదిగి పనిచేసిన ప్రతిచోటా ప్రజల ఆదరాభిమానాలు పొందగలిగారని వక్తలు కొనియాడారు. ఈ సందర్భంగా మోహనరావు దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు గాదిరాజు రామకృష్ణంరాజు, చివటం త్రిశూలపాణి, ఎంపీపీ మైలాబత్తుల సోని, జెడ్పీటీసీ బొక్కా రాధాకృష్ణ, డిప్యూటీ ఎంపీడీఓ కాకర్లమూడి నాగేంద్రకుమార్, మండల పరిషత్ పర్యవేక్షకులు వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు నగదు ప్రోత్సాహకం

నరసాపురం: నరసాపురం రూరల్ పాత నవసపురం గ్రామంలో సంక్రాంతి సమయంలో కోడిపందాల జూదరులను పట్టుకుని ప్రభుత్వానికి రూ.5 లక్షలు పైనే ఆదాయం సమకూర్చేలా చేసినందుకు 15 మంది పోలీసులకు రూ.72,480 నగదు బహుమతిని సోమవారం నరసాపురం జూనియర్ అడిషనల్ సివిల్ జడ్జి ఎస్ రాజ్యలక్ష్మి ప్రకటించారని డీఎస్పీ డి.శ్రీవేద తెలిపారు. 2024 డిసెంబర్ 5న పాత నవరసపురంలో పోలీసులు దాడి చేసి 23 మందిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.3,31,200 నగదు, 26 కోడిపుంజులు, ఒక కారు, 28 మోటార్ సైకిళ్లు, 17 మొబైల్ ఫోన్లతో పాటు కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నారు. వీటిని వేలం వేయగా రూ.5,08,700 ఆదాయం వచ్చిందని డీఎస్పీ చెప్పారు. దాడిలో పాల్గొన్న నరసాపురం, పాలకొల్లు రూరల్ సీఐలతో పాటు మరో 13 మంది కానిస్టేబుళ్లకు జడ్జి నగదు ప్రోత్సాహాన్ని ప్రకటించారని వివరించారు.

నోట్ పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న కర్రా జయసరిత

పాలకొల్లు సెంట్రల్: ప్రభుత్వం, దాతలు ఇచ్చే సహకారంతో విద్యార్థులు ఉన్నతమైన విద్యను అభ్యసించాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి కర్రా జయసరిత సూచించారు. సోమవారం స్థానిక జీవీఎస్‌వీఆర్ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జయ సరిత మాట్లాడుతూ క్రమశిక్షణ గల విద్యతో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాయపూడి భవానీప్రసాద్, పార్టీ నాయకులు జోగాడ ఉమామహేశ్వరరావు, దేవ రాజేష్, మామిడిశెట్టి చిట్టిబాబు, వీరా మల్లికార్జునుడు, రామాంజుల చిన్నమదు, పెచ్చెట్టి లక్ష్మీ విమల తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ లారీల ఢీ



ఆచంటలో రోడ్డు ప్రమాదంలో క్యాబిన్ ధ్వంసమైన టిప్పర్

పెనుగొండ: ఆచంటలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా సోమవారం తెల్లవారు జామున రెండు టిప్పర్ లారీలు ఢీ కొన్నాయి. దీంతో ఓ టిప్పర్ లారీ క్యాబిన్ పూర్తి ధ్వంసమైంది. డ్రైవర్ సురక్షితంగా బయట పడడంతో పెను ప్రమాదం తప్పింది. టిప్పర్ లారీ క్యాబిన్ పూర్తిగా ధ్వంసమైంది.

2న హుండీ ఆదాయం లెక్కింపు

ఉండి: వెలివర్రులో వీరపేరంటాలమ్మ వారి హుండీని ఈ నెల 2న లెక్కిస్తున్నట్లు ఆలయ ఇన్‌చార్జి కార్యానిర్వహణాధికారి తోట శ్రీనివాస్ తెలిపారు. దేవాదాయ శాఖ తనిఖీదారు (భీమవరం) ఆధ్వర్యంలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తామన్నారు.